# ఎక్కడైనా ఇంతే!

## చిత్తూరి కోటేశ్వరరావు

''నానెలా బతగ్గలను..చెప్పు...తల్లి చిన్నపుడే పోనాది..పోతా..పోతా ఈ గుంట నప్పసెప్పినాది..అయ్యేమో తాగుబోతు ఎధవ..ఆడికాడ, ఈడికాడ డబ్బు గుంజేసి..నన్నుందర్నీ మనువాడ మంటడు. నీవే సెప్పే సూరక్కా'' అంటూ వాపోయింది సింహాలు..

''పట్నణంలో ఏం తిందామని వచ్చినావే..ఇక్కడ మన తిండి మనల్ని తిన్నివ్వరు..యీల్లు మనల్నే తింటారు. సరే..ఈ రాత్రికి తొంగొని పొద్దుగాల నా యమ్మట రా..నేను సేసే కాడ నీకు పని యిప్పిత్తా..మరి ఈ గుంటనేటి సేత్తవ్?'' అంది సూరక్క.

''ఏదో మారగం నువ్వే సూడవే'' అంది సింహాలు.

సూరక్క పెట్టిన కారం మెతుకులు తిని పడుకొన్న సింహాలుకి నిద్ర కరువైంది. ఆలోచనలన్నీ తన ఊరు చినబాడంగి మీదనే....

★★★

''ఏటే సింహాలు? మన మనువెప్పుడే'' అంటూ చెయ్యి పట్టుకోబోయాడు. చిన్న అప్పుడు..

''నీతో నాకేటి మనువురా..పానం తీసేయగల్ను.. చెయ్యి వదల్రా ఎదవ సచ్చినోడా'' అంటూ చెయ్యి విదుల్చుకొంది.

''రాత్రే కందా! మీ అయ్యకి యాభై రూపాయలు యిచ్చినాను..ఈ నెల్రోజులు మంచివి కావట గందా! వచ్చేనెల్లో లగ్గం ఎట్టుకుందాం'' మళ్ళీ పట్టుకోబోయాడు.

''ఒరేయ్..ఎదవ సచ్చి నోడా..నీ జిమ్మడ..అలాటి ఎదవ ఆలోచన సేకు. .నీతల నరికేసి జైలు కెల్తా.. అంతేగాని నీతో నాకేట్రా మనువు'' అంటూ అప్పణ్ణే వదిలించుకొంది.

వానలు తగ్గి పొలాలు ఎండిపోతున్నాయి. నారు లేదు నీరు లేదు. మెస్తా పంట పూర్తిగా పోయింది. చక్కెర ఫ్యాక్టరీ మూసే శారు. బతుకు గడవడం మహా కష్టంగా ఉంది. ఆడా మగా పట్టణాలకు వలస పోతున్నారు. ఊళ్ళు వెల వెల పోతున్నాయి. కూడు దొరకడమే మహా కష్టంగా ఉంది. సింహాల్ని మాత్రం ఏ మూల పనున్నా పిలుస్తుంటారు.

కష్టం చేస్తుంది.• అందరిలా అటూ ఇటూ చూడదు. ఆదమరచి ఎపుడూ ఉండదు. ఖచ్చితమైన మనిషి. ఒకళ్ళ ఊసు ఎత్తదు. మరొకరి పని చెడగొట్టదు. ఉన్న నాల్గెకరాల పొలం తండ్రి తాకట్టు పెట్టాడు. తాకట్టు లెక్కలు చెప్పడు షావుకారు. ప్రతి సంవత్సరం మాత్రం తిరగ రాస్తుంటాడు. నాల్గు ఎకరాల పొలం ఉంచుకొని సింహాలు ఇంకొకరి పొలంలో పని చేస్తుంది. తండ్రి సింహాలు వట్టి తాగుబోతు. పెళ్ళాం పోయిన దగ్గర్నుంచి తాగుడెక్కువ చేశాడు. దాంతో అప్పులు ఎక్కువైనాయి. తాకట్టు పెట్టేందుకు యింకేమీ లేక తాగుడు కోసం కూతురు సింహాల్ని కుదువబెట్టి అక్కడా ఇక్కడా డబ్బులు గుంజి తాగి కూలబడుతుంటాడు. తాగి తూలి పడినప్పుడల్లా కూతురు సింహాల్ని బిడ్డని మోసినట్టుగా మోసుకుంటూ ఇంటికి తెస్తుంది.

''పోయిన మీ అమ్మతోడు. యింక తాగ..నేను తాగనంటే తాగను.'' యిలా ఎన్నిసార్లు ప్రమాణాలు చేశాడో దేవుడికే ఎరుక...

విసిగి, విసిగి ఓనాడు కూతురు సింహాలు సంపాదించిన డబ్బుతో సరుకులు కొందామని షావుకారు ఇంటికెళ్తే చేతిలో డబ్బులు గుంజుకొని షావుకారు-

''రాత్రి మీ నాయన నాతాన యాభై రూపా యలు అప్పు తీసుకొన్నడు. తాకట్టు ఏదైనా పెట్ట మంటే నాదగ్గరేముంది నా కూతురు తప్ప అన్నాడు. ఏం జెయ్యమంటావ్.. మరి'' అని నిలేశాడు.

ఊరి జనం అంతా పోగయ్యారు. కూతురు సింహాలు బిక్కచచ్చిపోయి కూలబడింది. పదిమంది పది మాటలు..తండ్రిని చంపేయాలన్నంత కోపం.. చంపి తను జైలుకెళ్తే చిన్న సింహాలుకి దిక్కెవరు!?..ఆలోచనల్లో పడ్డ కూతురు సింహాలు ఉలిక్కిపడింది. షావుకారు చెయ్యి తన భుజం మీద పడేటప్పటికి...ఒళ్ళు జలదరించి షావుకారు వైపు తీక్షణంగా చూసింది.

''అంత పౌరుషముంటే నా అప్పుతీర్చు..లేకపోతే నా గదిలోకి..రా'' అంటూ చెయ్యి పట్టుకు లాగబోయాడు.

శిలారాయి షావుకారు నెత్తిమీద శివతాండవం చేసింది. కూతురు సింహాలు తప్పిచ్చుకొంది.

ఏమీ చేయలేక షావుకారు ఖంగుతిన్నాడు.

రోజురోజుకీ అప్పులబాధ ఎక్కువైంది. తండ్రి సింహాలు చిత్తుగా తాగి రోడ్డు మీద వెళ్తుంటే, కుక్క రిస్తే..కూతురి మీద కోపం దాని మీద చూపించేసరికి, కుక్క తండ్రి సింహాల్ని కరిచి..పిచ్చివాణ్ని చేసి..పగ..తీర్చుకొంది.

కూతురు సింహాల్ని తండ్రి డబ్బు పిచ్చి, తాగుడు పిచ్చికి తోడు మామూలు పిచ్చి జతై ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే..డబ్బన్నా ఇవ్వు లేదా మమ్మల్ని మనువైనా ఆడు అంటూ అవతల అప్పులోళ్ళు ఆగడాలు. .చావాలని ప్రయత్నించింది. చిన్న సింహాలు మదిలో మెదిలి ప్రయత్నం మానుకొంది.

విశాఖపట్టణం రైల్వే స్టేషన్..గోదావరి ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం పై రెడీగా ఉంది. కూతురు సింహాలు, చిన్న సింహాలు ఏ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కాలో తెలియక ఖాళీగా ఉన్న కంపార్ట్‌మెంట్‌లోకి దూరారు.

''ఏయ్! ఇది రిజర్వేషన్ కంపార్ట్‌మెంటు..దిగి పొండి'' అంటూ పాసింజర్స్ అరుపులు విన్పించి దిగారు. వేరే కంపార్ట్‌మెంట్‌లోకి మారే ఆలోచనలో, ఉన్న వారికి సింహాద్రి అప్పన్నలా...కానిస్టేబుల్ అప్పారావు కన్పడి అదే బండిలో వాళ్ళు ప్రయాణం చేసేలా చేయగల్గాడు. పోలీస్ కానిస్టేబుల్ అప్పారావు, కూతురు సింహాలు, ఒకప్పుడు చినబాడంగిలో అయిదోక్లాస్ వరకు కల్సి చదువుకొన్న వాళ్ళవడంతో..ఒకర్నొకరు బాగా ఎరుగుదురు.

''బతకడానికి హైదరాబాదు పోతున్నావేటి?''

ఊరి జనం అంతా పోగయ్యారు. కూతురు సింహాలు బిక్కచచ్చిపోయి కూలబడింది. పదిమంది పది మాటలు..తండ్రిని చంపేయాలన్నంత కోపం.. చంపి తను జైలుకెళ్తే చిన్న సింహాలుకి దిక్కెవరు!?..ఆలోచనల్లో పడ్డ కూతురు సింహాలు ఉలిక్కిపడింది. షావుకారు చెయ్యి తన భుజం మీద పడేటప్పటికి...ఒళ్ళు జలదరించి షావుకారు వైపు తీక్షణంగా చూసింది.

అడిగాడు అప్పారావు. తిరిగి తనే అన్నాడు. ''అంత పెద్ద ఊళ్ళో ఎలా ఉండగలవ్?''

''అదేటి అప్పారావ్! మనూరోళ్ళు యాబయ్యి మంది..అక్కడ పెద్ద పెద్ద మేడలు కడతన్నారు. తెలీదా!..మన పోల్నాయుడు లేడూ ఆడి అక్క కూడా అకాడే పనిసేత్తన్నాది..దాని అడరస్ కూడా తీస్కున్నా..వైశాలి బిల్డింగ్స్..యూసుపుగూడా..దిగి ఖైంటనే స్టేషన్ కాడ తొమ్మిదో నెంబరు బస్సెక్కితే ఆడ దింపుద్దట..''

''అంత కష్టమెందుకులే..నేను గూడా హైదరాబాదు వత్తనాగా..సూరక్క కాడ నిన్ను వదిలి పెడతాలే..''

★★★

''సింహాలు..నీ జీతం లెక్కలు చూసి ఇవ్వాలి.. కొంచెం సేపు ఇక్కడే ఉండు..'' అన్నాడు మేస్త్రీ.

చీకటి పడ్తోంది. తొందరగా ఇంటికి జేరి చిన్న సింహాలుకి..వంట చేసి పెట్టాలన్న ఆత్రుతతో మేస్త్రీ వంక చూసింది.

''తొందరపడితే పనికాదు. లెక్కలు చూడాలి.. సూపర్‌వైజర్ గారు వస్తారుండు'' మేస్త్రీ దబాయించాడు.

కొంచెం సేపటికి మేస్త్రీ కూడా కన్పించలేదు. ఏమయ్యాడో..చూద్దామని ఆఫీస్ తలుపు కొంచెంగా నెట్టి తొంగి చూసింది సింహాలు..మేస్త్రీ ఇంకో ముగ్గురు ఆ గదిలో కూర్చుని తాగుతున్నారు.

''కొత్త పిల్ల కదా! బెదిరిస్తే ఎట్లా? దాని జీతం దానికిచ్చి ఇప్పటికి పంపేద్దాం..తర్వాత చూసుకోవచ్చు..మీక్కావాలంటే..మంచి గుర్రాలాంటోళ్ళు ఇద్దరున్నారు'' అంటున్న మేస్త్రీతో..జేబులోంచి డబ్బు తీసి ''సరే..పో..దాని మొహాన ఇది కొట్టు'' అన్నాడు సూపర్‌వైజర్.

''చూడమ్మా! సింహాలు ఏడు రోజులకి ఏడు యాభైలు మూడు వందల యాభై..నీకు పని ఇప్పించినందుకు నాకు పది రూపాయలు..రోజు కూలీలో నా వాటా అయిదు చొప్పున ముప్పై అయిదు రూపాయలు'' అంటూ నలభై అయిదు రూపాయలు తగ్గించి చేతిలో పెట్టాడు.


''అదేటి మేస్తిరీ..నాకు ఉజ్జోగం ఇప్పించినందుకు పది రూపాయలు కావాలంటే తీస్కో..అంతేకానీ రోజు కూలీలో అయిదు రూపాయలు అడగటం మాత్రం అన్యాయం..'' అంటూ బతిమాలుకుంది.

''అదేంటమ్మోవ్..కొత్తగా చెబుతున్నావ్..ఇక్కడింతే'' అన్నాడు ఒంగోలు మేస్త్రీ.

''నా కట్టం..నీవెట్టా తింటావ్'' కోపంగా ప్రశ్నించింది.

''అదంతే! నోర్మూసుకొని..పనికెక్కు. ఈ ఊళ్ళో కుదరదంతే..'' అని తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఉస్సూరంటూ ఇంటి ముఖం పట్టింది సింహాలు...



''ఏటక్కా మేస్తిరీ..మన కట్టం రోజుకి అయిదు రూపాయలు తింటున్నాడు..యిదేటి అన్నాయం..''

''మేస్తిరీలందరూ ఇట్టాగే బాగుపడుతున్నారే. ..ఎదవ సచ్చినోళ్ళు మన కాడ అయిదు రూపాయలే....ఆ పాలమూరు వాళ్ళకాడ అయితే రోజుకి పది రూపాయలు.

సింహాలుకి ఏమీ అర్థం కాలేదు. అలసిపోయి నిద్దరోతున్న చిన్న సింహాలు కోసం వంట మొదలెట్టింది.

నెల్లాళ్ళు గడిచిపోయాయి. ఆమె ఆలోచనల్నుంచి చిన బాడంగి కూడా దూరమయ్యింది. తండ్రి గురించి ఆలోచనలు చేసే టైం కూడా లేకుండా పోయింది.

''సింహాలు పని అయ్యేం తర్వాత..నేనొచ్చేంత వరకు ఉండు.'' అన్నాడు మేస్త్రీ.

''ఏటే! సూరక్కా..యిల గంటడు మేస్తిరీ?''

''వాడంతేనే..ఇట్టాంటి పనులు ఇంకో నాలుగు దిక్కుల్లో ఉన్నాయట..అంతా డబ్బే..కట్టం మనది. ..సుకం ఆడిది'' అక్కసంతా తీర్చుకుంది.

అందరూ జీతం తీసుకొని వెళ్ళిపోయారు. సింహాలు ఒంటరిగా మిగిలిపోయింది. అంతలో ఎక్కడ్నుంచో ఆదరా బాదరాగా వచ్చాడు. మేస్త్రీ..

''సింహాలు లోపలికి రా'' అంటూ పిలిచాడు.

బిక్కు బిక్కుమంటూ లోపలికి నడిచింది.


''సార్..ఈ సింహాలు పని సరిగా చేయట్లేదు. వీళ్ళ చెల్లెలు పనిమీద కొస్తుంటుంది. ఇద్దరూ కల్సి ఒకటే ముచ్చట్లు..ఈమెని చూసి మిగిలిన వాళ్ళు కూడా నేర్చుకొంటారు. ..సార్.. అందుకే సోమవారం నుంచి పనిలోకి రావద్దంటున్నా సార్'' గబ గబా చెప్పాడు మేస్త్రీ.

సింహాలు నిశ్చేష్టురాలయ్యింది.

''నేను మాట్లాడతాలే.. నువ్వెళ్ళు.'' మేస్త్రీతో అన్నాడు సూపర్‌వైజర్. ..సింహాలు వంక చూస్తూ.

''సింహాలు..అయ్యగారు చెప్పింది ఇనుకో.. దేవుడు..మా గొప్ప ధర్మరాజా. నీకే కష్టం ఉండదు. మీ చెల్లెల్ని కూడా బాగా చూసుకోవచ్చు..నేను చెబుతున్నాగా విను..అయ్యగారి భార్య పుట్టింటి కెళ్ళింది. నువ్వు రేపట్నుంచి వాళ్ళింట్లో పని చెయ్యొచ్చు..ఈ ఇటుక, సిమెంట్ మోసే పనుం దదు.'' అంటూ హితోపదేశం చేసి వెళ్ళిపోయాడు.

గదిలో సింహాలు, సూపర్ వైజర్ ఇద్దరే మిగిలారు. తలుపు పడింది. చిన్నగా నవ్వాడు సూపర్‌వైజర్.




మంచం మీదకి రమ్మన్నట్టు సైగ చేశాడు. పరిస్థితి అర్థమైంది సింహాలుకి.

''నేనలాంటి దాన్ని కాదు సార్. .ఇప్పటికే చాలా సేపయిపోనా ది..పని సేయడం లేదంటున్నారు కదా! మానేసి ఇంకో దగ్గర పన్జూసుకుంటా నన్నొది లేయ్..బాబూ'' ప్రాధేయ పడింది.సూపర్‌వైజర్‌లో కామం కదం తొక్కి- సింహాల్ని వాటేసుకోబోయా డు. తప్పిం చుకొంది సింహాలు.. మళ్ళీ తిరిగి తన పశుబలంతో రెండు చేతులా సింహాల్ని పట్టి మంచం మీదికి తోశాడు.

ఇంతలో తలుపు చప్పుడయ్యి.... సూరక్క, చిన్నసింహాలు లోనికి వచ్చారు. సింహాలు తేరుకుంది. సూపర్ వైజర్ ముఖం మాడిపోయింది. సూరక్కకి 'విషయం' అర్థమైంది. చిన్నసింహాలు 'ఏం అర్థం కాక' చూస్తుండిపోయింది.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ ''మా జీతం..మా కియ్యి'' అన్న వాళ్ళ మాటకు లెక్కపెట్టకుండా కొన్ని నోట్లు వాళ్ళ చేతిలో పెట్టి ''ఎక్కడా..ఎవరితో ఏమీ అనొద్దు..'' అని వేడుకున్నాడు.

కాలం గడిచిపోతుంది. సింహాలు చేతినిండా డబ్బులు..ఎప్పటికైనా పొలం తాకట్టు విడిపించాలన్న తాపత్రయం. మనువాడి బాడంగిలోనే బతకాలన్న ఆశ...రోజు రోజుకీ బలపడుతున్నాయి.

''సూరక్కా మా గుంటని ఎక్కడైనా బళ్ళో వేద్దామా!'' అని అడిగిందోరోజు..

''మనకేటే సదువులు..చదివేటి సెయ్యాలి? నాలుగు డబ్బులు సంపాదించి ఊరెల్లిపోవే'' సలహా యిచ్చింది. సూరక్క...తిరిగి తనే అంది.

''ఈ మహానగరంలో బతకాలంటే చానా ఇబ్బందులే..అన్నీ మాయలే..ఇక్కడ. ఆడమాయని మించిన మాయలేదు. ఆ రాతిరి మేం రాకపోతే నీ బతుకేటయ్యేది? నా సంగతంటావా..నాకు తాడు, బొంగరం లేదే..ఇక్కడే బతికి ఇక్కడే రాలిపోతా'' అని కళ్ళనీళ్ళు పెట్టుకొంది.

సింహాలు దారికి రాకపోయేసరికి సూపర్‌వైజర్ ఉద్యోగం లోంచి తీసేశాడు. కొన్నాళ్ళకు....

''ఇక్కడ కాకపోతే ఇంకోటి...పన్లకేటి తక్కువ. ఈ మేస్త్రీ ఒక్కడేనా..యింక మేస్త్రీల్లేరా.... నువ్వల్లకో'' అంది సూరక్క...అని చిన్న సింహాలు కేసి తిరిగి ''ఈ గుంటక్కూడా ఏదైనా పని సూత్తా...ఊరికే తొంగుంటే ఏటి లాభం? తొంగొని.. తొంగొని..లావెక్కిపోనాది...

★★★

''మేస్త్రీలు చూస్తే కమీషన్లంటారు..సూపర్‌వైజర్లకేమో ఆడాళ్ళు కావాలి..ఈళ్ళేంటి ఇల్లాగ! మనల్ని సంపుకొని తింటన్నారు..కష్టం చేసి కమీషనిస్తం..ఆడమనిషంటే మంచ మెక్కాలి..ఇదేటే సూరక్కా! పోయిన మేస్త్రీరి కాడ అయిదు రూపాయలే..ఈడికేమో పది కావాలంట.''

''ఎక్కడో ఒక దగ్గర తిరపడాలే..మనసు దిట్టం చేసుకొని బతకాలే..మనం పనికెళ్ళాక కమీసను యివ్వక తప్పదు..ఆ సూపర్‌వైజర్ మంచం ఎక్కక తప్పదు'' అంది సూరక్క...

''అందరూ మంచమెక్కుతారా!?

''నీలాంటి సక్కని సుక్కలికి ఈ బాదలు తప్పవే..నన్నెవడడుగుతాడు..? ఒకేల అడిగినా ఆడి మంచం ఇరిగిపోద్ది నా బరువుకి''

ఇద్దరూ నవ్వుకున్నారు.

''సింహాలు నువ్వెల్లిపోవే..మనువాడి సుఖంగా బతకవే..ఈ గొడవలు పోయేవి కావు..నీ కట్టాలు పోయేవి కావు'' మరోసారి హెచ్చరించి నిద్రలోకి జారుకుంది సూరక్క.

★★★

''తండ్రి పిచ్చి ఏమైందో? బాడంగిలో తనిల్లెలా ఉందో? షావుకారు బాకీ మూడేలు అని నేనొచ్చేనాటికి లెక్కకట్టాడు. సూరక్క ఉండబట్టి నాలుగు డబ్బులు మిగుల్చుకోగల్గింది. తను..చిన సింహాలుకి తిండిపెట్టి మూడొందరు ఇస్తున్నారు నెలకి..ఆ ఇంటి ఇల్లాలు చానా మంచి దంట..బట్టలు కూడా యిచ్చినాది..రేపు ఇంకో చోటికి పనికెళ్ళాల..మేస్త్రీగాడి కమీషన్ ఎక్కడైనా తప్పదు. కానీ సూపర్‌వైజర్ విషయం తల్చుకుంటేనే సెడ్డ సీకాకేస్తంది. ఈసారి ఎవరైనా సూపర్ వెయిజర్ పిలిత్తే వాడి నెత్తి పగల గొట్టాల'' అనుకొంది సింహాలు.

పొద్దున్నే లేచాక మధ్యలో పని ఎందుకులే సోమ వారం నుంచి కొత్తపనికి వెళ్ళొచ్చుని ఆలోచనలో పడ్డది. పన్నెండవుతుంది. చిన సింహాలు ఇంకా రాలేదేంటా అనుకొంటుంటే...రానే వచ్చింది. ఏడుస్తూ..

''ఏటి?..ఏమైనాది?'' ఆత్రంగా అడిగింది.

ఆమాటతో చిన్న సింహాలు వెక్కి వెక్కి ఏడ్వటం మొదలెట్టింది. నోట మాట రాక అక్కని పట్టుకొని బావురుమంది. అడిగేకొద్దీ యింకా బిగుసుకుపోయింది చిన్నసింహాలు. ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది. ఆ ఇంటావిడ పని చేయలేదని కొట్టిందేమో నని..అనుకొం ది..సింహాలు..

రాత్రికి గాని అసలు విషయం తెలీలేదు. ఆ ఇంటాయన చిన్నపిల్లపై చేసిన అఘాయిత్యం.. రాత్రంతా కలవరిం తలు..''మీ కాళ్ళట్టుకుంటా నన్నొగ్గేయండి..నన్నొగ్గేయండి..'' అని.

పొద్దున్నే ఒళ్ళు జ్వరంతో కాలిపోతుంటే డాక్టరుకి చూపించారు.

''ఇది పోలీస్ కేసు..పిల్లని మానభంగం చేశారు. వెళ్ళి పోలీసులకి రిపోర్టివ్వండి.. ''సలహా ఇచ్చాడు డాక్టర్..

''ఆరి భగవంతుడా! ఆడికి చెరపటానికి చిన్నపిల్లే దొరికిందా'' అంది సూరక్క.

సింహాలు కోపంతో. ''ఆడంతం చూస్తా'' అన్నది.

''మన బాధ ఎవడిక్కావాలే..ఆడి మీద రిపోటిత్తే...ఆడికాడ నాల్గు డబ్బులు నూకి మన మీదే దొంగతనం కేసెడతారే..'' అంది సూరక్క ఆక్రోశంగా.

''అదేంటే జరిగింది సూసినట్టు అలా సెప్పేత్తావ్'' అంది సింహాలు అయోమయంగా.

''అంతేనే ఈ మాయదారి నగరంలో నేనూ మొదట్లో ఒకరింట్లో పనిక్కుదిరినానే..ఆడు పట్టపగలే తాగొచ్చి..ఆడిపెళ్ళాం ఉజ్జోగానికి ఎల్లినాక..నన్ను చెరపబోయాడే..పోలీసోళ్ళ దగ్గర కెల్తే ఎదవ మాటలు సెప్పి ఆడ్ని పిలిపించి, బెదిరించి ఆడి కాడ డబ్బు కాజేసి నా మీద దొంగతనం కేసెట్టి మూణ్ణెల్లు బొక్కలో వేశారే..అంతేనే సింహాలు..మనం ఈ గొప్పోళ్ళతో పోట్లాడలేం...గొప్పోళ్ళంతా ఒకటేనే.. వాళ్ళకి పోలీసోళ్ళు..వత్తాసు..నువ్వేంటి? మా గొప్పగా వాణ్ణి సంపేత్తానంటున్నావ్..సంపేత్తే ఉరిసిచ్చి ఏత్తారు. అదే గొప్పోడు చేత్తే శిచ్చుండదు, పాడుండదు. నేను సెడిపోయానే..నాలాగా నువ్వు సెడిపోవాక.. నామాటిని బాడంగి ఎల్లిపోవే'' మరోమారు హెచ్చరించింది.

''అయితే పోలీసోడి దగ్గరకెళ్ళొద్దు అంటావా!'' అమాయకంగా అడిగింది. సింహాలు.

''వెళ్తే నాకు జరిగిందే, నీకూ జరుగుద్ది. ఆ గుంట మీద ఏదో కేసు పెడతారే పోలీసోళ్ళు..అదెందుకు దాని మెడకి..? జరిగిందేదో జరిగింది. మన కరమ అని వదిలెయ్'' చిన్న సింహాల్ని గుండెకత్తుకొని బావురుమంది.

సూరక్క మాటల్లో జ్ఞానోదయం కల్గి.....

''ఎక్కడైనా ఇంతే! ఆడది ఆడదే'' అనుకొంది మనసులో కూతురు సింహాలు ఏదో నిర్ణయాని కొచ్చినట్టుగా.